క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత

మచిలీపట్నంటౌన్: 19వ డివిజన్ రైలుపేటకు చెందిన మొహమ్మద్ గాలీబ్ షరీఫ్ ఇటీవల మృతిచెందాడు. డివిజన్‌లోని తోటి పింఛను దారులు ఒక్కొక్కరు రూ.100 చొప్పున సేకరించిన రూ. 27 వేలను మృతుని కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి బూరగ రామారావు, డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ చిటికిన నాగేశ్వరరావు, పింఛనుదారులు, నాయకులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

మోపిదేవి: పాఠశాలలో విద్యార్థులు చదువుకునేందుకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని గురుకుల విద్యా సొసైటీ బృందం ఉపాధ్యాయులకు సూచించింది. మోపిదేవిలో ఆంధ్రప్రదేశ్ మత్స్యకార గురుకుల బాలుర పాఠశాలను మంగళవారం పరిశీలించారు. బృందం ప్రతినిధి పవిత్ర, శ్రీరామ్ మాట్లాడుతూ తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్న విద్యార్థులు చదువుకునేందుకు కావలసిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, విద్యాబుద్ధులతో పాటు మంచి క్రమశిక్షణ కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కె. వీర రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుచ్చగడ్డలో తాగునీటి పరీక్షలు



లక్ష్మీపురం(చల్లపల్లి): ప్రజారోగ్యం దృష్ట్యా లక్ష్మీపురం శివారు పుచ్చగడ్డలో మంగళవారం తాగునీటి పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీఓ ఎ.అరుణకుమారి, సర్పంచ్ కొల్లూరి కోటేశ్వరరావు, మండల వైద్యాధికారులు డాక్టర్ కేవీ పద్మావతి, డాక్టర్ కె.విజయరావు పర్యవేక్షణలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భోగాది జగత్ గ్రామంలో తాగునీటి శాంపిళ్లు సేకరించి భౌతిక, రసాయనిక పరీక్షలు చేశారు. బ్యాక్టీరియా టెస్ట్ కోసం ల్యాబ్‌కు పంపించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ ఆకుల సాంబశివరావు, హెల్త్ సూపర్‌వైజర్ తోట సుధాకర్, సీహెచ్ఓ కె.సుమతి, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల పరిశీలన

చల్లపల్లి: ఎంపీపీ కోట విజయ రాధిక మంగళవారం స్థానిక గ్రంథాలయం పక్కన ఉన్న మండల పరిషత్ (జేబీ) ప్రాథమిక పాఠశాల పరిశీలించారు. పాఠశాలలో వసతులు, మధ్యాహ్న భోజనం, పరిసరాలు, పరిశుభ్రతపై ఆరా తీశారు. ఆహార పదార్థాలు రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహారం వండుతున్నారని, విద్యాబోధన సక్రమంగా ఉందని తెలిపారు.

ముమ్మరంగా ఉపాధి పనులు

గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండలంలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 19 గ్రామాల్లో మంగళవారం 1,250 మంది కూలీలు పనులకు హాజరవుతున్నట్లు ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్ తెలిపారు. ప్రతి గ్రామంలోనూ నిరుపేదలకు ఉపాధి కల్పించేందుకు చేపట్టిన ఈ పనులు అత్యంత వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. ప్రకృతి కూడా సహకరించడంతో చెరువులు, పంటకాల్వల మరమ్మతులు చేపట్టామని ఆయన తెలిపారు.

ఆర్బీకేల వద్ద ఈ క్రాప్ నమోదు వివరాలు

పామర్రు: మండల పరిధిలోని 17 ఆర్బీకేల వద్ద ఆయా గ్రామాల పరిధిలో ఈనెల 4వ తేదీ వరకు నమోదు చేసిన ఈ క్రాప్ పంట వివరాలను ప్రదర్శించామని మండల వ్యవసాయశాఖ అధికారి నాగరాణి మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో మొత్తం 20,161 ఎకరాల్లో పంట నమోదు చేశామన్నారు. ఈనెల 17వ తేదీ వరకు ఈ జాబితాలను ఆర్బీకేల వద్ద ప్రదర్శిస్తామన్నారు. ఆయా గ్రామాల్లోని రైతులు పంట నమోదు వివరాలను సరిచూసుకోవాలని సూచించారు. పంట నమోదులో ఏమైనా మార్పులు ఉంటే వెంటనే రైతు భరోసా కేంద్రాల్లోని వీఏఏకి తెలియజేసి సరిచేయించుకోవాలని కోరారు.

అల్లినగరంలో పొలంబడి

మండవల్లి: మండలంలోని అల్లినగరంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం పొలంబడి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంటీ పృథ్వీరాజ్, డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం రబీ సీజన్ పూర్తయిన సందర్భంగా రైతులు 30 రకాల విత్తనాలతో పచ్చిరొట్ట పంటను వేసుకుంటే భూసారం పెరుగుతుందన్నారు. ఎండ వేడి నుంచి భూమిలోని సూక్ష్మజీవులను రక్షించుకోవచ్చని చెప్పారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని సద్వినియోగం చేసుకుని అధిక దిగుబడులు సాధించి ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఎంసీఆర్పీ నారాయణ, పీఆర్పీ శ్రీనివాస్, సీర్పీ నాగవిజయ, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- నగరంలో ఎనిమిది కేంద్రాలు ఏర్పాటు
- హాజరుకానున్న 5,294 మంది విద్యార్థులు
- సీసీ కెమేరాలతో నిఘా

మచిలీపట్నంటౌన్: ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. నగరంలో ఎనిమిది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 5,294 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 2,527మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 2,767 మంది ఉన్నారు. ప్రభుత్వ ఆదేశంతో కేంద్రాల వద్ద సీసీ కెమేరాలను ఏర్పాటు చేశారు. ఎనిమిది ఫ్లయింగ్ స్క్వాడ్, ఎనిమిది మంది చీఫ్ సూపరింటెండెంట్లు, ఎనిమిది మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తారు. బుధవారం నుంచి మొదటి సంవత్సరం ఇంటర్మీడియెట్ విద్యార్థులకు, గురువారం నుంచి రెండో సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఏప్రిల్ 4వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. ప్రతిరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మూడు గంటల పాటు పరీక్షలు జరుగనున్నాయి. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు ఇప్పటికే పలుమార్లు రివిజన్



పెడన విజయానంద జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రం

నిర్వహించారు. పలు కళాశాలల యాజమాన్యాలతో పాటు విద్యార్థులు ఆలయాలకు క్యూకట్టారు. ఆలయాలకు వెళ్లి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా ఆశీర్వదించాలని భగవంతుడ్ని వేడుకున్నారు. పరీక్షల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

పెడనలో ఇంటర్ పరీక్ష కేంద్రం

పెడన: ఇంటర్మీడియెట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పెడనలో గతంలో రెండు పరీక్ష కేంద్రాలుంటే ఈ ఏడాది ఒకే ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అదీ కూడా ప్రైవేట్ కళాశాల కావడం విశేషం. నిఘా నేత్రాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పెడన బలిపర్రు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల నుంచి ప్రథమ సంవత్సరం 49, ద్వితీయ సంవత్సరం 51 మంది హాజరవుతారని ప్రిన్సిపాల్ రూతమ్మ తెలిపారు. చెన్నూరు జెడ్పీహెచ్ఎస్ మహిళా కళాశాల నుంచి ప్రథమ సంవత్సరం 23 మంది, పెడన ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రథమ సంవత్సరం 50, ద్వితీయ సంవత్సరం వంద మంది హాజరవుతారు. పరీక్షా కేంద్రం ఏర్పాటు చేసిన విజయానంద జూనియర్ కళాశాల నుంచి 186 మంది ఫస్ట్ ఇయర్, 200 మంది సెకండ్ ఇయర్ విద్యార్థులు హాజరవుతారని పరీక్షా కేంద్రం అధికారులు తెలిపారు. పరీక్షా కేంద్రంలో ఫస్ట్ ఇయర్ 344, సెకండ్ ఇయర్ 324 మంది పరీక్షలు రాయనున్నారని సీఎస్ రమణరావు, డీఓ మున్వర్ తెలిపారు.

బంటుమిల్లిలో రెండు కేంద్రాల ఏర్పాటు

బంటుమిల్లి: బంటుమిల్లిలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. బంటుమిల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీ, వాగ్దేవి కళాశాలలో బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన 400మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇప్పటికే పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమేరాలను ఏర్పాటుతో పాటు అన్ని చర్యలు తీసుకున్నారు.

పేర్ని నాని చొరవతో మదర్సాకు స్థలం

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో మదర్సా నిర్మాణానికి 227 గజాల స్థలాన్ని మంజూరు చేస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ఇటీవల మచిలీపట్నంలోని రాజుపేటలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లగా అక్కడి ముస్లిం మతపెద్దలు పలువురు ఆయనను కలిసి రాజుపేటలో మదర్సా నిర్మాణానికి ఖాళీగా ఉన్న 227 గజాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని కోరారు. ఈ విషయాన్ని పేర్ని నాని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సానుకూలంగా స్పందించాలని కోరారు. పేర్ని అభ్యర్థన మేరకు సోమవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజుపేటలోని 227 గజాల స్థలాన్ని మదర్సా నిర్మాణానికి కేటాయిస్తూ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అడిగిన వెంటనే స్పందించి విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి క్యాబినెట్‌లో ఆమోదం తెలిపేందుకు విశేష కృషి చేసిన పేర్ని నానికి ఆ ప్రాంత ముస్లిం మతపెద్దలు, ముస్లింలు పార్టీలకు అతీతంగా కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంపై హర్షం వ్యక్తంచేశారు.

లయన్స్ సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయి

డిస్ట్రిక్ట్ గవర్నర్ దామెర్ల శ్రీశాంతి



ఆర్థిక సాయం అందిస్తున్న దామెర్ల శ్రీశాంతి

చల్లపల్లి: లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ దామెర్ల శ్రీశాంతి అన్నారు. మంగళవారం స్థానిక గీతా మందిరంలో లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ అఫీషియల్ విజిట్ కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీఆర్‌కే నగర్ అధ్యక్షుడు ఏఎల్ఆర్‌కే ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో శ్రీశాంతి మాట్లాడుతూ 105 ఏళ్లుగా లయన్స్ క్లబ్ ఎంతోమంది ఉత్తమ సేవా భావం కలిగిన నాయకులను తయారు చేసిందన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వీఆర్‌కే నగర్ సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమన్నారు.

ఆర్థిక సాయం అందజేత..

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గ్రామానికి చెందిన నిరుపేద ఆటో డ్రైవర్ గుడి రాజేష్ మృతి చెందగా అతని ఇద్దరు పిల్లలకు విద్యాభ్యాసం కోసం ఉప సర్పంచ్, క్లబ్ ప్రముఖులు ముమ్మనేని రాజకుమార్ రూ.10 వేలు, క్లబ్ ప్రతినిధులు రూ.10 వేలు, జిల్లా గవర్నర్ శ్రీశాంతి రూ.5 వేలు కలిపి రూ.25 వేలు ఆర్థిక సాయం చేశారు. పౌరాణిక, సినీ రంగస్థల కళాకారుడు బోలెం రామారావు, అంతర్జాతీయ డప్పు కళాకారుడు చాట్రగడ్డ శ్రీనివాసుడు, ప్రజా గాయకుడు నందేటి శ్రీనివాసరావులను ఘనంగా సన్మానించారు. బస్టాండ్ సెంటర్‌లో ఆటో, రిక్షా కార్మికుల కోసం విశ్రాంత డెప్యూటీ తహసీల్దార్ ఎంవీ కృష్ణారావు తన సతీమణి దివంగత లలితకుమారి పేరుతో సిమెంటు బెంచీలు ఏర్పాటు చేయగా ప్రారంభించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ క్లబ్ ప్రతినిధులు దామెర్ల శ్రీనివాసరావు, పి.ప్రభాకరరావు, వీవీపీఎస్ ఆంజనేయులు, ఎస్ఈ శ్రీనివాసరావు, క్లబ్ కార్యదర్శి నర్రా సాయిబాబు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం

పెడన: నులి పురుగుల నివారణతో చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జి. గీతాబాయి అన్నారు. చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా నులి పురుగుల నివారణకు ఆల్‌బెండాజోల్ మాత్రలను ఉచితంగా వేస్తున్నామని చెప్పారు. నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెడన పట్టణంలోని బంగ్లా స్కూల్ (మెయిన్‌రోడ్డులోని ఎంపీపీ పాఠశాల), సెయింట్ విన్సెంట్ పల్లోటి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఆల్‌బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి మాట్లాడారు. ఏడాది వయస్సు నుంచి 19 ఏళ్ల వయస్సు కలిగిన వారి కడుపులో ఉండే నులి పురుగులను నిలువరించడానికి ఈ మాత్రలు ఉపకరిస్తాయని చెప్పారు. పల్లోటి స్కూల్ కరస్పాండెంట్ ఫాదర్ జోజిరెడ్డి, ప్రిన్సిపాల్ రాజీవ్, పెడన పీహెచ్‌సీ వైద్యాధికారి పర్వేజ్ హైదర్ పాల్గొన్నారు.

- పెడన పీహెచ్‌సీ పరిధిలోని 3,069 మందికి గాను 2,872 మందికి మాత్రలను పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి పర్వేజ్ హైదర్‌తో పాటు ఎంపీహెచ్ఓ వీరయ్య తదితరులు పర్యవేక్షించారు.
- చేవేంద్ర పీహెచ్‌సీ పరిధిలో 1,947 మందికి గాను 1,788 మందికి మాత్రలను పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం. వరప్రసాద్‌బాబు పర్యవేక్షణలో ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు మాత్రలను పంపిణీ చేశారు.
- పెడన అర్బన్ హెల్త్ సెంటర్‌లో డాక్టర్ నిఖిలేష్ ఆధ్వర్యంలో 6,680 మందికి మాత్రలను పంపిణీ చేశారు. భట్ల జ్ఞానకోటయ్య జెడ్పీహెచ్ఎస్‌లో వార్డు కౌన్సిలర్ పిచ్చిక సతీష్‌బాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు మాత్రలను మింగించారు.

చిన్నారులకు మాత్రల పంపిణీ

కృత్తివెన్ను: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం చినపాండ్రాక, సీతనపల్లి, లక్ష్మీపురం పీహెచ్‌సీల పరిధిలో నులి పురుగుల మాత్రలను పంపిణీ చేశారు. ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు మాత్రలను అందించారు. వైద్యులు సందీప్, లావణ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- గూడూరు: నులి పురుగుల నిర్మూలనకు ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికతో పనిచేస్తోందని గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు అన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గూడూరు జెడ్పీ



పల్లోటి స్కూల్‌లో మాత్రల పంపిణీని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ గీతాబాయి



కోడూరులో నులి పురుగుల నివారణ మాత్రలు వేస్తున్న తహసీల్దార్ లతీఫ్‌పాషా



తుమ్మలపాలెంలో మాత్రలు వేస్తున్న సర్పంచ్ కోడే రేణుకాదేవి



చిన్నారులకు మాత్రలు వేస్తున్న కృత్తివెన్ను ఎంపీపీ, జెడ్పీటీసీ

హైస్కూల్‌లోని విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందును అందజేశారు. సర్పంచి లింగం సులోచనారాణి, హెచ్ఎం డి.పుష్పలత, లింగం విజయ్‌కుమార్, మల్లవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సరళాదేవి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నులి పురుగు నివారణ మాత్రలను ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు.

- బంటుమిల్లి: బంటుమిల్లి పీహెచ్‌సీ పరిధిలోని 34 అంగన్‌వాడీ కేంద్రాలు, 30 పాఠశాలలు, కాలేజీల్లో ఏడు వేల మందికి నులి పురుగుల నివారణ మాత్రలు వేశామని వైద్యాధికారులు పవన్‌కుమార్, సౌందర్య తెలిపారు. పెదతుమ్మిడి పీహెచ్‌సీ పరిధిలోని 30 అంగన్‌వాడీ, 30 పాఠశాలల్లో 2,221 మందికి మాత్రలు వేశామని వైద్యాధికారులు సువర్చల, జయశ్రీలు తెలిపారు. మిగిలిన వారికి ఈ నెల 18వ తేదీన మాత్రలు వేస్తామని వారు చెప్పారు. కార్యక్రమాలను సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పర్యవేక్షించారు.

నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ

కోడూరు: కోడూరు జెడ్పీ పాఠశాలలో వైద్యాధికారి మౌనిక పర్యవేక్షణలో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను అందించారు. సర్పంచి వెన్నా షైనీ, తహసీల్దార్ షేక్ లతీఫ్‌పాషా, ఎంఈఓ టి.వి. ఎం.రామదాసు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఈ మాత్రలను అందించనున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

- పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లి పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ కె. హారిక మాట్లాడుతూ జాతీయ నులి పురుగుల నివారణా దినోత్సవం సందర్భంగా 17 పాఠశాలలు, 15 అంగన్‌వాడీ కేంద్రాల్లో కలిపి మొత్తం 1,190 పిల్లలకు గాను 1,131 మంది చిన్నారులకు ఆల్‌బెండజోల్ మాత్రలు వేశామని చెప్పారు. డాక్టర్ శ్రీరామ్ సాయి, హెల్త్ ఎడ్యుకేటర్ వి. రాధ, హెల్త్ సూపర్ వైజర్ ఎస్. ప్రమీలారాణి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుని సేవలో సోము వీర్రాజు



స్వామివారి చిత్రపటం అందుకుంటున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు

మోపిదేవి(అవనిగడ్డ): స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు మంగళవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు దేవదాయ శాఖాధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందజేశారు. వేదపండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

శక్తి కేంద్రాలు ఏర్పాటు చేస్తాం..

మండలంలోని చిరువోలు గ్రామంలో యువ మోర్చా రాష్ట్ర నాయకుడు చిరువోలు బుచ్చిరాజు ఇంటి వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో రాష్ట్రంలో 10 వేల మంది కార్యకర్తలతో శక్తి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. జనపోరు-2 పేరుతో పాదయాత్ర చేపట్టి రాష్ట్ర వ్యాప్తంగా 44 వేల పోలింగ్ బూత్‌లను కలుపుతూ 30 బహిరంగ సభలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజా సమస్యల అర్జీలు స్వీకరిస్తూ ఏప్రిల్ ఒకటి నుంచి మే నెలాఖరుకు పాదయాత్ర సాగుతుందని వివరించారు. పెంచిన వంట గ్యాస్ ధరను తగ్గించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోసూరు రామాంజనేయులు సోము వీర్రాజుకు వినతిపత్రం అందచేశారు. బీజేపీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ బిట్రా శివనారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజాబాబు, మండల అధ్యక్షుడు కామిసెట్టి రమేష్‌బాబు పాల్గొన్నారు.

కుప్పకూలిన వంతెన

తప్పిన ప్రమాదం



కోడూరు: మండలంలోని నరసింహపురం-సాలెంపాలెం గ్రామాల మధ్య ఉన్న వంతెన మంగళవారం సాయంత్రం కూలిపోయింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. రెండు గ్రామాల మధ్య రాకపోకలు సాగించేందుకు, పొలాలకు వెళ్లేందుకు ఉపయోగపడేలా లింగన్నకోడు మురుగు డ్రెయిన్‌పై సుమారు 40 ఏళ్ల కిందట వంతెనను నిర్మించారు. ఈ వంతెన శిథిలావస్థకు చేరింది. రెండేళ్ల నుంచి వంతెన శ్లాబ్ పెచ్చులూడటంతో పాటు ఇరువైపులా రెయిలింగ్‌లు కూడా విరిగిపోయాయి. మంగళవారం సాయంత్రం కోతమిషన్‌తో ఉన్న భారీ లారీ ఈ వంతెనపై నుంచి నరసింహాపురం వైపునకు వెళుతుండగా వంతెన మధ్య భాగం ఒక్కసారిగా కుప్పకూలింది. వంతెన మధ్యలో లారీ ఇరుక్కుపోయింది. నిత్యం రాకపోకలు సాగించేందుకు దోహదపడే వంతెన కుప్పకూలిందని, అధికారులు స్పందించి వెంటనే వంతెన నిర్మించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

31 నాటికి డీఎల్ఆర్ పూర్తి చేయాలి

కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో ఈ నెల 31వ తేదీ నాటికి డీఎల్ఆర్ (డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్)ను వెబ్‌ల్యాన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం సచివాలయం నుంచి ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న రీ-సర్వే పురోగతిని ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి కలెక్టర్ వివరించారు. రీ-సర్వే పూర్తయిన 100 గ్రామాలకు గానూ 82 గ్రామాల్లో డీఎల్ఆర్ ను వెబ్‌ల్యాన్‌లో అప్‌లోడ్ చేశామని చెప్పారు. మిగిలిన 18



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ రంజిత్‌బాషా చిత్రంలో జేసీ అపరాజితసింగ్, అధికారులు

గ్రామాల్లో డీఎల్ఆర్ అప్‌లోడ్ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జేసీ అపరాజితసింగ్, డీఆర్వో ఎం. వెంకటేశ్వర్లు, సర్వే శాఖ ఏడీ గోపాలరాజా, కలెక్టరేట్ సూపరింటెండెంట్ ఎం. హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఫీవర్ సర్వే

మండవల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి, ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ సిబ్బంది నిర్వహించిన ఫీవర్ సర్వే మంగళవారంతో ముగిసిందని పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.అనీల పేర్కొన్నారు. పీహెచ్‌సీ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేశారన్నారు. మండలంలో 17 వేలు గృహాలు ఉండగా 86 శాతం సర్వే పూర్తి చేశామని చెప్పారు. దగ్గు, జ్వరం, జలుబుతో బాధపడేవారు పీహెచ్‌సీలో చికిత్స పొందాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో శిలువమార్గం

గుడివాడటౌన్: క్రైస్తవులకు అత్యంత పవిత్రమైన ఉపవాస దీక్షల్లో భాగంగా మంగళవారం శిలువ మార్గం యాత్రలు నిర్వహించారు. రూరల్ మండలం తట్టివర్రు గ్రామంలో ఆర్సీఎం చర్చి ఆధ్వర్యంలో ఈ ధ్యానమార్గం జరిగింది. ఈ సందర్భంగా విచారణ గురువు మైఖేల్ మాట్లాడుతూ.. గుడ్‌ఫ్రైడేకు ముందు 40 రోజులు క్రైస్తవులు ఉపవాస దినాలు ఆచరిస్తారన్నారు. ఇందులో భాగంగా పలు ప్రాంతాల్లో శిలువమార్గ ధ్యానం నిర్వహిస్తామన్నారు.

ఏప్రిల్ 14న బీఎస్ఏ జాతీయ అవార్డుల ప్రదానం

తోట్లవల్లూరు: బహుజన సాహిత్య అకాడమీ చేస్తున్న సేవలు అభినందనీయమని బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు శొంఠి నాగరాజు అన్నారు. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యాన ఏప్రిల్ 14న ఉయ్యూరులో నిర్వహించే బీఎస్ఏ నేషనల్ అవార్డ్స్-2023కి సంబంధించిన పోస్టర్‌ను మండల కేంద్రమైన తోట్లవల్లూరులో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 124వ జయంతి రోజున ప్రపంచ జ్ఞానదినోత్సవం సందర్భంగా ఉయ్యూరు బైపాస్ రోడ్డులోని గ్రీన్‌ల్యాండ్ రిసార్ట్సు ఆవరణలో వివిధ రంగాలలో ఉత్తమసేవలు అందించిన వారికి అవార్డులు అందిస్తున్నామని నాగరాజు తెలిపారు. రాజ్యసభ సభ్యుడు, బీసీ హక్కుల నేత ఆర్.కృష్ణయ్య ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారన్నారు. బహుజనుల కళ, సాహిత్య వికాసానికి వారధిగా పనిచేస్తున్న బీఎస్ఏ అవార్డుల పంపిణీని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు జంపాన శ్రీనివాస్‌గౌడ్, బీసీ సేన రాష్ట్ర మైనారిటీ వింగ్ అధ్యక్షుడు ఆసిఫ్‌బాషా, బీసీ సంక్షేమ సేన రాష్ట్ర ప్రధానకార్యదర్శి దేవరాజుగట్టు శివ, బీసీ నాయకులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

పెడన: పట్టణంలోని ఒకటో వార్డులో పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం.. అమృతరావుకు చెందిన ఇంటిలో రామారావు అనే వ్యక్తి అద్దెకు ఉంటున్నాడు. మంగళవారం ఉదయం ఇంటికి తాళం వేసి కూలి పనులకు వెళ్లారు. ఇంట్లో నుంచి మంటలు వస్తుండటంతో పరిసర ప్రాంతంలోని వారు మంటలను అదుపుచేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు బండారు మల్లికార్జునరావు, కౌన్సిలర్ బళ్ల గంగయ్య, బళ్ల పద్మావతి తదితరులు బాధిత కుటుంబానికి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. 21వ వార్డు కౌన్సిలర్ పిచ్చిక సతీష్ రూ.2 వేలు సాయం చేశారు. పలువురు నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

నిధుల గోల్‌మాల్‌పై మహిళల ధర్నా

గుడివాడటౌన్(నందివాడ): తాము పొదుపు చేసుకున్న సొమ్ము అన్యాక్రాంతమైందని, తిరిగి చెల్లించాలని కోరుతూ నందివాడ మండలం జనార్దనపురం, నూతులపాడు తదితర గ్రామాలకు చెందిన మహిళలు మంగళవారం ధర్నా నిర్వహించారు. మండల కేంద్రమైన నందివాడ స్త్రీశక్తి భవనం ఎదురుగా ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ క్లస్టర్ కో-ఆర్డినేటర్‌గా పనిచేసిన మహిళ లక్షల రూపాయలు తమ పొదుపు సొమ్మును కాజేస్తే అధికారులు కేవలం ఆమెను సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారన్నారు. తమ సొమ్మును తిరిగి చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నాకు మద్దతు ప్రకటించిన సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌సీపీ రెడ్డి మాట్లాడుతూ నందివాడ మండలంలో ఈ విధమైన చర్యలు సర్వసాధరణమయ్యాయన్నారు. పూర్తి స్థాయిలో ఎప్పటికప్పుడు లెక్కలు చూడాల్సిన అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంతో ఈ విధమైన మోసాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇందుకు బాధ్యులైన అందరిపై చర్యలు చేపట్టి తిరిగి సొమ్ము పొదుపు ఖాతాలో వేసేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

రహదారి నిర్మాణ పనులు ప్రారంభం

గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండలం జనార్దనపురం నుంచి కుదరవల్లి వరకు రహదారి నిర్మాణ పనులు చేపట్టామని ఎంపీపీ పెయ్యల ఆదాం అన్నారు. రహదారి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. రూ.35 లక్షలతో ఈ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఇప్పటికే నందివాడ నుంచి కుదరవల్లి వరకు రహదారి నిర్మాణం పనులు పూర్తయ్యాయని చెప్పారు. ప్రస్తుతం ఇబ్బందికరంగా ఉన్న జనార్దనపురం నుంచి నందివాడ హైస్కూల్ వరకు రోడ్డు పనులు ప్రారంభించామన్నారు. దీంతో స్థానిక ప్రజలకు రహదారి సమస్య పరిష్కారమైందని చెప్పారు. సాధ్యమైనంత త్వరలో మండలంలోని మిగిలిన ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోవాడ నిర్మలకుమారి, గ్రామ సర్పంచ్ సరెళ్ల రత్నకుమారి, ఆర్అండ్‌బీ ఏఈ మహిరెడ్డి, మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షుడు కొండపల్లి కుమార్‌రెడ్డి, నాయకులు సరెళ్ల నాగేశ్వరరావు, గోవాడ అశోక్ పాల్గొన్నారు.

పంట నమోదు జాబితాలు పరిశీలించుకోండి

గూడూరు: 2022-23 రబీకి సంబంధించి ఈ పంట నమోదు గడువు ఈనెల 4వ తేదీతో ముగిసిందని గూడూరు మండల వ్యవసాయ శాఖాధికారి కె.హెప్సిబారాణి అన్నారు. ఈ పంట ముసాయిదా జాబితాలను గ్రామాల వారీగా ఆయా రైతు భరోసా కేంద్రాలలో సామాజిక తనిఖీ నిమిత్తం అందుబాటులో ఉంచామని చెప్పారు. రైతుల సందర్శనార్థం ఈనెల 17వ వరకు నోటీసు బోర్డుల్లో ఉంచే ముసాయిదా జాబితాలపై అభ్యంతరాలు ఉంటే ఆయా గ్రామాల వీఏఏల దృష్టికి తీసుకువెళ్లి లోపాలను సరిచేయించుకోవాలని ఆమె కోరారు. సామాజిక తనిఖీలలో భాగంగా నిర్వహించే గ్రామసభలలో తుది జాబితాలను చదివి వినిపిస్తారన్నారు. ఈ పంట నమోదులో పేర్లు సరిచేసుకోవడానికి ఇదే చివరి అవకాశమని చెప్పారు.

300 మందికి వైద్య పరీక్షలు

పెడన: స్థానిక ఇందిరా కాలనీలో మంగళవారం క్రీస్తు సంఘం, ఏలూరు ఆశ్రం ఆస్పత్రి వైద్య బృందం ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. 300 మందికి షుగర్, బీపీ, గుండె, కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మహిళలకు గైనిక్ సమస్యలపై స్త్రీల వైద్య నిపుణులు పరీక్షలు చేసి సలహాలు అందించారు. వైద్యులతో పాటు లలితకుమారి, కీర్తన, భాను, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.